సాక్షి
నారాయణపేట
సోమవారం, 18, ఆగస్టు, 2025



వేగంగా విద్యుదుత్పత్తి
జూరాలలోని ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టారు.
-8లో ▸



శిక్షణ.. ఉపాధి
సెట్విన్ సంస్థ నిరుద్యోగులకు వివిధ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తూ యువతకు ఉపాధి.. ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది.
-8లో ▸

గరిష్టం/కనిష్టం
29.6 /22.0
వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

పల్లెగడ్డను వదులుకోం!

ముక్తకంఠంతో నినదిస్తున్న గ్రామస్తులు



పల్లెగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం

- నేడు దేవాదాయశాఖ ట్రిబ్యునల్ కోర్టుకు హాజరుకానున్న 25మంది
- పుట్టిన ఊరి కోసం తమ వాదన వినిపిస్తామని వెల్లడి
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరిని విడిచివెళ్లమని శపథం
- స్పందించని ప్రజాప్రతినిధులు

మరికల్: తమ పూర్వీకులు వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతూ తమకు కానుకగా ఇచ్చిన 'పల్లెగడ్డ'ను వదులుకోమని గ్రామస్తులు ముక్తకంఠంతో తేల్చిచెబుతున్నారు. తమ గోడును ప్రభుత్వం పట్టించుకోకపోయినా కోర్టులో న్యాయ పోరాటం చేసి.. తమ గ్రామాన్ని కాపాడుకుంటామని శపథం చేస్తున్నారు. నిజాం నిరంకుశ పాలన నాటి నుంచి తరతరాలుగా తమ పూర్వీకులు ఊరిని కాపాడుకుంటూ వస్తున్నారని.. 2018లో ఓ అజ్ఞాత వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా చిన్నరాజమూరు ఆంజనేయస్వామి దేవాలయ భూమిలో పల్లెగడ్డ గ్రామం ఉందని ఫిర్యాదు చేయడంతో తమకు సమస్యలు మొదలయ్యాయని వాపోతున్నారు. అప్పటి నుంచి ఎండోమెంట్ అధికారులు తమకు దశల వారీగా కోర్టు నుంచి నోటీసులు జారీచేస్తూ భయాందోళనకు గురిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1,624 మందికి పైగా జనాభా..

నాలుగు కుటుంబాలతో మొదలైన పల్లెగడ్డ గ్రామంలో 250కి పైగా ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. 20 ఎకరాల గ్రామకంఠం ఉంది. మొత్తం 1,624 జనాభా ఉండగా.. 745 మంది ఓటర్లు ఉన్నారు. 254 రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలో 40 మంది, అంగన్‌వాడీ కేంద్రంలో 25మంది చదువుకుంటున్నారు. 250 ఇళ్లకు పైగా విద్యుత్ మీటర్లు ఉండగా.. ఇంటి పన్ను, నల్లా పన్నులు చెల్లిస్తున్నారు. అంతే కాకుండా గ్రామంలో ఆంజనేయస్వామి, శివాలయాలు, నాలుదిక్కులా గ్రామదేవతల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. 2వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు ఉన్నాయి.



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు

ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు..

చిన్నరాజమూరు ఆంజనేయస్వామి దేవాలయ భూమిలో నిర్మితమైన పల్లెగడ్డ గ్రామం మొదట్లో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేది. మరికల్ పంచాయతీ పరిధిలో ఉండటంతో కనీస వసతులకు నోచుకోక గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. కాలక్రమేణా గ్రామ జనాభా పెరుగుతూ రావడంతో 1980లో అప్పటి ప్రభుత్వం 15 ఇళ్లను పేదలకు నిర్మించి ఇచ్చింది. అప్పట్లోనే ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుచేశారు. గ్రామంలో అంతర్గత రహదారులకు ఇరువైపులా డ్రెయినేజీలు, పబ్లిక్ కొళాయిలు ఏర్పాటుచేశారు. ఇలా ప్రభుత్వ నిధులతో ప్రజా సమస్యలు తీరుస్తూ వచ్చారు. తెలంగాణ రాష్ట్ర వచ్చాక గత ప్రభుత్వం నూతన పంచాయతీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అప్పటి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి చొరవతో మరికల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పల్లెగడ్డను కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయించారు. ఆ తర్వాత ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు నిర్మించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి తాగునీరు అందిస్తున్నారు. నూతన గ్రామపంచాయతీ భవనం, సెగ్రిగేషన్ షెడ్, పల్లెప్రకృతి వనం, శ్మశానవాటిక, డంపింగ్‌యార్డు వంటి వాటిని నిర్మించారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పల్లెగడ్డ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికచేసి.. మొదటి విడతలో 66 ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేసింది. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఇలా ప్రభుత్వ నిధులతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతూ వస్తున్నారు. అయితే పల్లెగడ్డ గ్రామస్తుల సమస్యపై ప్రజాప్రతినిధులు పట్టనట్టుగా ఉండటం గమనార్హం.

పూర్వీకులు మాకిచ్చిన గ్రామం..



నాకు 75 ఏళ్లు. మా తాత ఎప్పుడు ఒకటి చెబుతుండే. నిజాం పాలనలో ప్రజలను చిత్రహింసలకు గురిచేసి దొచ్చుకునే వారట. వారి నుంచి కుటుంబాన్ని కాపాడుకునేందుకు అడవులకు వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నామని చెప్పేవారు. తల్లితో సమానమైన గ్రామాన్ని ఖాళీ చేయాలని 200 ఏళ్ల తర్వాత నోటీసులు ఇస్తే ఎలా ఖాళీ చేస్తాం. చావైనా, బతుకైనా ఇక్కడే ఉంటాం.

– హన్మంతు, పల్లెగడ్డ

అమర్‌నాథ్ నుంచి వచ్చాను..



ఇంటికి కోర్టు నోటీసులు వచ్చాయని కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా తెలియజేస్తే అమర్‌నాథ్ నుంచి రెండు రోజుల క్రితం వచ్చాను. మూడు తరాల తర్వాత నాల్గో తరం వారికి దేవాదాయశాఖ అధికారులు ఇళ్లు ఖాళీ చేయాలని.. లేకుంటే కోర్టుకు హాజరు కావాలని నోటీసులు ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంది. రూ.లక్షలు ఖర్చు చేసి ఇళ్లు నిర్మించుకున్నాం. గ్రామాన్ని మాత్రం వదిలిపెట్టాం.

– నర్సింహులు, పల్లెగడ్డ

ఊరిని విడిచివెళ్లం..



తమ పూర్వీకుల కాలం నాటి నుంచి ఉంటున్న మా ఊరిని విడిచి ఎక్కడికి వెళ్లం. ఏమైనా పండుగలు వచ్చినా మంచి, చెడు జరిగినా ఊళ్లో అందరం కలిసికట్టుగా నిర్వహించుకుంటాం. తమను అధికారులు విడదీయలేరు. నోటీసులకు భయపడేది లేదు.

– చెన్నమ్మ, పల్లెగడ్డ

ప్రజాప్రతినిధులు స్పందించాలి..



గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, రేషన్‌షాపు, సీసీరోడ్లు, డ్రెయినేజీలు, మిషన్ భగీరథ నీటి సరఫరా తదితర అభివృద్ధి పనులు ఎన్నో జరిగాయి. కొత్త పంచాయతీగా పల్లెగడ్డ అవతరించింది. 200 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న పల్లెగడ్డ గ్రామాన్ని ఖాళీ చేయాలని 2018 నుంచి కోర్టు చుట్టూ తిప్పడం భావ్యం కాదు. ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి న్యాయం చేయాలి.

– కుర్మయ్య, పల్లెగడ్డ

ఇందిరమ్మ ఇళ్లు కూడా ఇక్కడే..



ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పల్లెగడ్డ గ్రామం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక కావడంతో మొదటి విడతగా 66 ఇళ్లు మంజూరయ్యాయి. 1980లో కూడా అప్పటి ప్రభుత్వం 15 ఇళ్లను పేదలకు మంజూరు చేసింది. ఇన్నాళ్లుగా ప్రభుత్వ నిధులతో గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి ఎండోమెంట్ అధికారులకు కనిపించడం లేదు. కోర్టులో న్యాయ పోరాటం చేసి గ్రామాన్ని కాపాడుకుంటాం.

– విజయ్, పల్లెగడ్డ

మరిన్ని నోటీసులు..

పల్లెగడ్డ గ్రామం విషయం దేవాదాయ ట్రిబ్యునల్ కోర్టు పరిధిలో ఉంది. త్వరలోనే మరికొంత మందికి కోర్టు నుంచి నోటీసులు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం 25 మందికి నోటీసులు జారీ అయ్యాయి. వారి వద్ద ఏమైనా ఆధారాలు ఉంటే దేవాదాయశాఖ ట్రిబ్యునల్ కోర్టులో సమర్పించాలి.

– కవిత, దేవాదాయశాఖ ఈఓ, మహబూబ్‌నగర్

న్యూస్‌రీల్

దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు



నారాయణపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 11ఏళ్ల కాలంలో పేదరికం, నిరుద్యోగం, ఆకలిచావులు పెరిగిపోయాయన్నారు. 2020లో విధించిన లాక్‌డౌన్ దివ్యాంగుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉన్న దివ్యాంగుల్లో సగం మందికి యూడీఐడీ కార్డులు రాలేదని.. 65శాతం మందికి ఉపాధి లేదన్నారు. పోరాటాలతో సాధించుకున్న 2016 ఆర్‌పీడబ్ల్యూ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. సుగమ్య భారత్ అభియాన్ పథకం మోదీ ప్రచారం కోసమే తప్ప.. దివ్యాంగుల కోసం కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా చేయూత పింఛన్లు ఎందుకు పెంచడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు బాబు, రంగయ్య, మల్లప్ప, నర్సప్ప, కృష్ణ, బాలరాజు, బస్వరాజు, పెంటయ్య, మల్లేష్, గోవిందు, చంద్రశేఖర్, సాయబన్న, హన్మంత్ తదితరులు ఉన్నారు.

గణేశ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో ఈసారి గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భీంచందర్, వెంకటయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వారు విలేకర్లతో మాట్లాడారు. వినాయక ప్రతిష్ఠాపన వేడుకలను ఈ నెల 27న నిష్ఠతో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. పండితుల సూచనల మేరకు ఉదయం 6నుంచి 9 గంటల వరకు, 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 9గంటల వరకు మండపాల్లో గణేశుడు కొలువుదీరే విధంగా చూసుకోవాలన్నారు. నిత్యం పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 5న నిమజ్జన వేడుకల సందర్భంగా రాత్రి 9:30 గంటలకు శోభాయాత్రకు సిద్ధం చేసి, శనివారం రాత్రి 10.30 గంటల వరకు జలప్రవేశం పూర్తిచేయాలన్నారు. సెప్టెంబర్ 7న గ్రహణం ఉన్నందున గణేశ్ నిమజ్జనోత్సవానికి శుభం కాదన్నారు. సమావేశంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, పట్టణ అధ్యక్షుడు మురళి బట్టడ్, కార్యదర్శి ప్రవీణ్ ఉన్నారు.

19, 20న స్పాట్ అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: డీఈఈసెట్-25లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ నెల 19, 20న స్పాట్ అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రధానాచార్యులు మహమ్మద్ మేరజుల్లాఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల డీఎల్‌ఈడీ కోర్సుకు సంబంధించి ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 21న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉమ్మడి జిల్లాలోని ఆయా కళాశాలల్లో హాజరు కావాలన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కొత్తకోట రూరల్: పెద్దమందడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పి.కోమల్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శాంతన్న, పీడీ మన్యంయాదవ్ ఆదివారం, తెలిపారు. ఈ నెల 16న జిల్లాకేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి అండర్-15 వాలీబాల్ బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చారని.. సోమ, మంగళవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొననున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ చక్కటి ప్రతిభ కనబర్చాలని సూచించారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి ఉండాలి



నర్వ పీఏసీఎస్‌లో యూరియా స్టాక్ వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో పురోగతి ఉండాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మక్తల్ పట్టణంలో 150 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. అందులో భాగంగా మక్తల్‌లో అన్ని హంగులతో 150 పడకల ఆస్పత్రి భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. కొత్త ఆస్పత్రిలో అధునాతన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దన్నారు. అనంతరం కర్ని గ్రామంలో చెరువు అలుగును మంత్రి పరిశీలించారు. పంచదేవ్‌పాడులో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గణేశ్‌కుమార్, కట్ట సురేశ్, రాజుల ఆశిరెడ్డి, కృష్ణయ్య, వెంకటేశ్, రాము, చిన్న హన్మంతు, బాలప్ప, ఆంజనేయులుగౌడ్, లింగప్ప రవికుమార్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి అయినా యూరియా ఇవ్వాల్సిందే..

నర్వ: రైతులు యూరియా కోసం పంపిణీ కేంద్రాల వద్దకు వస్తే అర్ధరాత్రి అయినా అందించాల్సిందేనని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నర్వ పీఏసీఎస్‌లో యూరియా స్టాక్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మక్తల్ నియోజకవర్గంలో నర్వ మండలానికే 20 శాతం ఎక్కువ యూరియాను సరఫరా చేయడం జరిగిందని.. రైతులకు యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ సిబ్బందికి మంత్రి సూచించారు. యూరియాను పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, పీఏసీఎస్‌లో సీఈఓ అందుబాటులో లేకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. యూరియా పంపిణీ పూర్తయ్యే వరకు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ ఉన్నారు.

భూ నిర్వాసితులకు అండగా నిలుస్తాం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి

నారాయణపేట/దామరగిద్ద: పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు అండగా నిలుస్తామని డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల సంఘం గౌరవాధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, రైతు సంఘం నాయకులు వెంకోబ, గోపాల్, ధర్మరాజుగౌడ్ తదితరులు మాట్లాడారు. తాము ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని.. ప్రతి ఎకరానికి రూ. 30లక్షల నష్టపరిహారం, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. అనంతరం శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. భూ నిర్వాసితులకు న్యాయం చేయడమే తన లక్ష్యమన్నారు. అవసరమైతే సీఎం కాలు మొక్కి న్యాయమైన పరిహారం చెల్లించేలా చూస్తానని భరోసానిచ్చారు. గతంలో 69 జీఓపై కొందరు దొంగ నాటకాలు ఆడారని అన్నారు. ఇటీవల కానుకుర్తికి వచ్చిన ఓ నాయకురాలు రైతులను మభ్యపెట్టే విధంగా మాట్లాడారని.. తాము పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా సాగునీరు తెస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి తీరుతామన్నారు. జిల్లా రైతాంగానికి సాగు నీటిని అందించే ఈ ప్రాజెక్టు విషయంలో ఎవరూ రాజకీయాలు చేయొద్దని కోరారు. భూ నిర్వాసితుల తరపున ఈ నెల 22 తర్వాత సీఎంను కలిసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. అదే విధంగా దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలో భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. కార్యక్రమాల్లో గోపాల్‌రెడ్డి, శెట్టి రమేశ్, భీంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ శివారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఈదప్ప, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, భీంరెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.

❒ భూ నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాతే ప్రాజెక్టు పనులు కొనసాగించాలని భూ నిర్వాసితుల సంఘం తీర్మానించింది. జిల్లా కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 18నుంచి 19 వరకు భూ నిర్వాసిత గ్రామాల్లో చైతన్య సదస్సులు, 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో వివిధ రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు వినతిపత్రాలు అందజేయడం, రాష్ట్రస్థాయిలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు, 25న ట్రాక్టర్లతో చలో కొడంగల్ (కాడ) కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు.

'టెండర్లతో మత్స్యకారులకు అన్యాయం'

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): టెండర్ల పేరుతో మత్స్యకారులకు మరోసారి అన్యాయమే జరుగుతుందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ కోసం మత్స్య శాఖ ఫెడరేషన్ ద్వారా ఈ ఏడాది రూ.122 కోట్ల బడ్జెట్ ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఉచిత పంపిణీ కోసం టెండర్ల ద్వారా కాకుండా ప్రతి సొసైటీ అకౌంట్లలో నగదు జమ చేయాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే టెండర్లను పిలిచి కాంట్రాక్టర్లకు ఇస్తే అవినీతికి అవకాశం ఉంటుందని, ఇప్పుడు మరో మార్గంలో దళారీ వ్యవస్థను తీసుకొస్తున్నారని ఆరోపించారు. కేటాయించిన పూర్తి బడ్జెట్‌ను ప్రతి మత్స్య సొసైటీ పరిధిలో ఉన్న జలవనరులకు సరిపడేంత చేప, రొయ్య పిల్లలకు అయ్యే ఖర్చును మత్స్యకారుల సొసైటీల అకౌంట్లలో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు.

చదువుతోపాటు సంస్కారం నేర్పాలి



మాట్లాడుతున్న పండిత్ ప్రియదత్తు శాస్త్రి

ఊట్కూరు: తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు సంస్కారం నేర్పించాలని పండిత్ ప్రియదత్తు శాస్త్రి అన్నారు. ఊట్కూరులోని ఆర్యసమాజ్ భవనంలో నిర్వహిస్తున్న శ్రావణవేద త్రిదివసీయ కార్యక్రమం ఆదివారం ముగిసింది. మూడు రోజులపాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వేదయజ్ఞం ప్రవచనాలు నిర్వహించారు. చివరిరోజు పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసమానతలు, రుగ్మతలను రూపుమాపేందుకు ఆర్యసమాజం కృషి చేస్తుందన్నారు. ప్రపంచంలో భారతదేశ కుటుంబ వ్యవస్థ పటిష్టమైనదని.. కుటుంబ వ్యవస్థ ఇలాగే కొనసాగాలంటే పిల్లలకు చదువుతో పాటు సంస్కారం చాలా ముఖ్యమన్నారు. సాత్విక ఆహారం భుజించాలని, దాన ధర్మా లు చేపట్టాలని ఆయన కోరారు. ఆర్యసమాజం వ్యక్తిలో సంస్కారాన్ని నింపేందుకు పాటుపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గరిడి లింగిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఆర్యసమాజ్ ప్రతినిధులు కనకప్ప ఆర్య, శివపాల్, దివాకర్, పవన్, బాలరాజు, జ్ఞానేశ్వర్, సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్తామని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను సంఘం గౌరవాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, సంఘం నాయకులు పలు తీర్మానాలు చేస్తూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రేషన్ కార్డులు, సకాలంలో వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా సంఘ భవనం నిర్మించుకునేందుకు స్థలం కేటాయించాలన్నారు. అనంతరం ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి బుచ్చిరెడ్డి, అదనపు కార్యదర్శి కె.సత్యన్నచారి, నాయకులు రహిమాన్‌సోఫి, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

అనర్హులను ఎంపిక చేస్తే చర్యలు

పాన్‌గల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో 16 మంది, వెంగళాయిపల్లిలో నలుగురికి ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలు అందజేసి నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా తెల్లరాళ్లపల్లితండాలో ప్రభుత్వ ఉద్యోగి కుటుంబానికి ఇల్లు మంజూరు కావడంతో రద్దు చేసి అర్హులైన వేరే కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని.. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500కు గ్యాస్ సిలిండర్, పంట రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా వంటి పథకాలు నెరవేర్చినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులను ఎంపిక చేసినా, ఇళ్ల మంజూరుకు డబ్బులు వసూలు చేసిన అధికారులు, అధికార పార్టీ నాయకులు ఎవరైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని.. చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని, పిల్లలను బాగా చదివించాలని కోరారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు రాని వారికి రెండోవిడతలో మంజూరవుతాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన పేదలకు తప్పక న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, ఎంపీడీఓ గోవిందరావు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు రవికుమార్, వెంకటేష్‌నాయుడు, పుల్లారావు, భాస్కర్‌యాదవ్, రవినాయక్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కమనీయం.. పాల ఉట్లోత్సవం

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని ఆదివారం పలు గ్రామాల్లో పాల ఉట్లోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాల ఉట్లు కొట్టేందుకు యువత పోటీ పడ్డారు. ఉత్సవాల్లో భాగంగా డప్పుల మోతలు, డీజే సౌండ్‌కు చిన్నా, పెద్ద తేడా లేకుండా నృత్యాలు చేశారు.

వివరాలు 9లో..



మందిపల్లితండాలో పాలఉట్టి కొడుతున్న యువకులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం




భూత్పూర్: అడ్డాకుల మండలం కందూర్ స్టేజీ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. జడ్చర్ల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న గూడ్స్ వాహనం అడ్డాకుల మండలం కందూరు స్టేజీ సమీపంలో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును దాటే క్రమంలో వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గూడ్స్ వాహనంలో ఉన్న నాగలక్ష్మన్న (45) అక్కడికక్కడే మృతిచెందగా, రఫీక్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. నాగలక్ష్మన్న స్వగ్రామం ఆత్మకూర్ మండలం పిన్నంచర్ల కాగా భార్య సత్యమ్మ, ఓ కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రఫీక్ ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన వారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో వలస కూలీ ఆత్మహత్య

వెల్దండ: ఆర్థిక ఇబ్బందులతో వలస కూలీ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెల్దండలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుందని ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. చారకొండ మండలం దొంగలగట్టుతండాకు చెందిన రాత్లావత్ జయేందర్ వద్ద నెలరోజుల క్రితం యూపీకి చెందిన వలస కూలీలు పంకజ్‌కుమార్(35)తోపాటు రాజ్‌కుమార్, రోషన్ మేస్త్రీ కూలి పనులు చేస్తున్నారు. వారం క్రితం ఇంటి నిర్మాణం పనులు పూర్తికావడంతో రాజ్‌కుమార్, రోషన్ హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. పంకజ్‌కుమార్ ఏదో ఒకచోట పనికల్పించాలని ఈనెల 16న జయేందర్‌ను కలిశాడు. వెల్దండలోని అద్దె ఇంట్లో ఉండగమని చెప్పగా.. రాత్రి 9గంటలకు వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున వెళ్లి చూసేసరికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. తరచూ మృతుడు కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు చెప్పేవాడని జయేందర్ పోలీసులకు వివరించారు. మృతదేహాన్ని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. జయేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి పట్టివేత : ఇద్దరిపై కేసు నమోదు



ఊట్కూరు: మండల కేంద్రం శివారులో శనివారం 125 గ్రాముల గంజాయి పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎస్ఐ రమేష్ తెలిపారు. మండలంలోని పులిమామిడికి చెందిన అరవింద్‌కుమార్, కర్ణాటకలోని గుర్మిట్కల్‌కు చెందిన బోరెభాను సంజీవ్ కలిసి గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో గంజాయిని విక్రయిస్తుండగా.. పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామని వివరించారు.

శిక్షణ.. ఉపాధి

నిరుద్యోగుల పాలిట వరం.. సెట్విన్ శిక్షణ కేంద్రం

ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థికంగా అండ లేని యువతకు.. సాంకేతిక విద్య అభ్యసించినా నైపుణ్యం లేని విద్యార్థులకు.. వివాహమై ఏదో ఒక పని చేసి కుటుంబానికి ఆసరాగా ఉండాలని పరితపించే అతివలకు.. డిమాండ్ ఉన్న రంగాల్లో పట్టు సాధించాలి అనే యువకులకు అండగా నిలుస్తోంది ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్. మహిళలకు బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్.. యువకులకు కంప్యూటర్ హార్డ్‌వేర్, సీసీ కెమెరాల రిపేర్, డ్రోన్ల నిర్వహణ.. ఇలా ఎన్నో అంశాల్లో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధితోపాటు పలు పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేలా తీర్చిదిద్దుతోంది. తాజాగా ఈ శిక్షణ కేంద్రం జడ్చర్లలో ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశారు. - జడ్చర్ల



సెట్విన్ కేంద్రంలో సిద్ధంగా ఉన్న కంప్యూటర్ ల్యాబ్

- జడ్చర్లలో ఏర్పాటుకు సర్వం సిద్ధం
- మహిళలు, యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ
- రూ.20 లక్షలతో భవనంలో మౌలిక వసతుల కల్పన



జడ్చర్లలో ప్రారంభానికి సిద్ధమైన సెట్విన్ శిక్షణ కేంద్రం భవనం

నిరుద్యోగులకు ఆయా రంగాల్లో శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించడానికి 1978లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం సెట్విన్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్, ట్రైనింగ్ ఇన్ ట్విన్ సిటీస్) ఏర్పాటు చేసింది. హైదరాబాద్, సికింద్రాబాద్ కేంద్రంగా యువతకు శిక్షణ ఇచ్చేది. అనంతరం తెలంగాణ ప్రభుత్వ యాజమాన్యంలోని ఈ సంస్థ 2007 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి అవకాశాలను మెరుగు పరుచడానికి జిల్లాలకు విస్తరించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024–25కు సంబంధించి జహీరాబాద్, జడ్చర్లలో మరో రెండు సెట్విన్ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి ప్రకటించారు. ఈమేరకు గతేడాది ఆగస్టులో జడ్చర్లలోని జౌకీనగర్‌లో నిరుపయోగంగా ఉన్న గురుకుల భవనాన్ని ఆయనతోపాటు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, సంస్థ ఎండీ వేణుగోపాల్ పరిశీలించారు. అక్టోబర్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తామని కూడా అప్పట్లో ప్రకటించారు. అయితే అనివార్య కారణాలతో ఆలస్యమైంది. ఎట్టకేలకు త్వరలో శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సంబంధిత పాలకులు, అధికారులు సర్వం సిద్ధం చేశారు.

ఎంతో మందికి ఉపాధి

జడ్చర్లలోని జౌకీనగర్ గురుకుల భవనాన్ని శిక్షణకు సిద్ధం చేశారు. రూ.20 లక్షల అంచనా వ్యయంతో మరుగుదొడ్లు, మూత్రశాలలు తదితర మౌళిక వసతులు కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 శిక్షణా కేంద్రాల ద్వారా యువత, అతివలకు శిక్షణ అందిస్తున్నారు. ఇదిలాఉండగా, ఈ శిక్షణ కేంద్రంలో మూడు నెలల పాటు శిక్షణ పొందిన అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. ఆయా సర్టిఫికెట్లతో దేశంలోని ఎక్కడైన పరిశ్రమలు, తదితర యూనిట్లలో ఉపాధి పొందవచ్చు. సెట్విన్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటారు. అంతేగాక స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకోవడానికి బ్యాంకులు రుణాలు ఇవ్వడంలో ఈ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇంత ప్రాధాన్యత ఉన్న శిక్షణ కేంద్రం జడ్చర్లలో ఏర్పాటు కావడంపై నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పలు కోర్సులలో శిక్షణ

రోజు రోజుకు పెరుగుతున్న సాంకేతికతకు అనుగుణంగా పలు రంగాల్లో నైపుణ్యతను పెంచేందుకు సెట్విన్ శిక్షణ ఉపయోగపడుతుంది. ప్రధానంగా యువతకు అక్కరకు వచ్చే వృత్తులలో సంతరించుకుంటున్న ఆధునిక సాంకేతికతపై శిక్షణ ఇవ్వనుంది. మహిళలకు బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైన్, జరీ అల్లడం వంటి ప్రాధాన్యత కోర్సులతో పాటు కంప్యూటర్ ఎడ్యుకేషన్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎయిర్ లైన్ టికెటింగ్, సెల్‌ఫోన్ రిపేర్, స్పోకెన్ ఇంగ్లీష్, ప్రింటింగ్ ప్రెస్, సీసీ కెమెరాల మరమ్మతులతో పాటు ఏసీ, వాషింగ్‌మిషన్, ఆర్‌ఓ మిషన్స్, కటింగ్ అండ్ టైలరింగ్, డ్రోన్ నిర్వహణ, తదితర కోర్సులలో శిక్షణ ఇవ్వనుంది. అయితే మొదటగా కంప్యూటర్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ గార్మెంట్ మేకింగ్, ఎలక్ట్రీషియన్, రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండీషనర్ కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అడ్మిషన్లు ప్రారంభం




సెట్విన్ శిక్షణ కేంద్రంలో దాదాపు 400 మందికి శిక్షణ ఇవ్వనున్నాం. ఎంపిక చేసిన కోర్సులలో 3 నెలల పాటు శిక్షణ ఇస్తాం. ఇందుకు నామమాత్రంగా ఫీజు ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇస్తాం. ఈ సర్టిఫికెట్లు పొందిన వారికి పరిశ్రమలలో, బ్యాంకు రుణాల మంజూరులో తగు ప్రాధాన్యత లభించే అవకాశాలు ఉన్నాయి. – విజయ్‌కుమార్, సెట్విన్ కోఆర్డినేటర్, జడ్చర్ల

సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ఎందరో నిరుద్యోగ యువతీ,యువకులకు సెట్విన్ శిక్షణ కేంద్రం వరం లాంటింది. ఇక్కడ ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ పొందిన వారికి ఉద్యోగ,ఉపాధి రంగాలలో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన వారు మాత్రమే కాకుండా ఎక్కడి వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి మెరుగైన శిక్షణ ఇవ్వడమే ధ్యేయంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. – అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

జూరాలకు పెరిగిన వరద



జూరాల క్రస్టు గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి

ధరూరు/రాజోళి/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. శనివారం రాత్రి 8 గంటలకు వరకు 85 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఆదివారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు లక్ష క్యూసెకులకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 11 గేట్లను ఎత్తి 77,946 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే విద్యుదుత్పత్తి నిమిత్తం 38,818 వదలగా.. 46 క్యూసెక్కులు ఆవిరైంది. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయినీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.989 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులకు 53వేల క్యూసెక్కులు..

సుంకేసులకు ఆదివారం ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో 53వేల క్యూసెక్కులకు చేరింది. దీంతో 12 గేట్లను ఒక మీటర్ మేర తెరిచి 49,632 క్యూసెక్కులను దిగుకు, కేసీ కెనాల్‌కు 2,180 క్యూసెక్కులను విడుదల చేసినట్లు జేసీ మహేంద్ర తెలిపారు.

415 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి..

జూరాలకు ఎగువ నుంచి భారీ వరద నీరు వస్తుండటంతో జల విద్యుత్ కేంద్రాల్లో ఈ ఏడాది లక్ష్యానికి చేరువగా విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. ఈ ఏడాది మే నుంచే విద్యుదుత్పత్తి ప్రారంభించారు. 2025 –26 కు సంబంధించి 610 మి.యూనిట్లు లక్ష్యం కాగా.. ఆగస్టు 17 నాటికి 415 మి.యూనిట్లు చేరుకుంది. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో నారాయణపూర్, ఆల్మట్టి డ్యాంల నుంచి జూరాలకు వరద పోటెత్తుతోంది. త్వరలోనే లక్ష్యాన్ని చేరుకోనుంది. ఆదివారం ఎగువలో 6 యూనిట్ల ద్వార 234 మెగావాట్లు, 236.943 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వార 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

కాల్పులు విరమించి.. శాంతి చర్చలు జరపాలి



అచ్చంపేట అమరవీరుల స్థూపం వద్ద పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

అచ్చంపేట: కగార్ హత్యాకాండను నిలిపివేయాలని, శాంతి చర్చలు జరిపి.. కాల్పుల విరమణ పాటించాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్ చేసింది. ఈమేరకు వరంగల్ అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 24న నిర్వహించే బహిరంగ సభకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆదివారం అచ్చంపేట అమరవీరుల స్థూపం వద్ద పలువురు నాయకులు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండున్నర దశాబ్దాలుగా ఆదివాసీలను వెంటాడుతూ, హత్యలు చేస్తూ రూ.కోట్లాది విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించడం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఆదివాసీ ఉద్యమాలు బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో సల్వా –జుడుము, గ్రీన్ హంట్, సమాదాన్ ప్రహార్ ఆపరేషన్లు, కగార్ పేరుతో పాశవికమైన హత్యాకాండను కొనసాగిస్తున్నాయన్నారు. 70 ఎన్‌కౌంటర్లలో 600లకు పైగా ఆదివాసీలను, ఉద్యమకారులను హత్య చేసిందన్నారు. ఇది చాలదన్నట్లు ఇంకా దారుణ మారణకాండను కొనసాగిస్తూ 2026 మార్చి 31 వరకు మావోయిస్టు రహిత భారత్‌ను నిర్మిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రగల్బాలు పలుకుతున్నారని, ఇది సరికాదన్నారు. కార్యక్రమంలో సీఎల్‌సీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్క బాలయ్య, టీపీఎఫ్ రాష్ట్రకో కన్వీనర్ ఎడ్ల అంబన్న, బయ్యని శ్రీశైలం, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు ముద్దునూరి లక్ష్మీనారాయణ, జిల్లా కో-కన్వీనర్ పర్వతాలు, నల్లమల కళాకారులు జక్క గోపాల్, టీఎస్‌ఎమ్‌ఎఫ్ కన్వీనర్ గోరటి అనిల్ కుమార్, సీఎల్‌సీ నాయకులు పంబలి బాలయ్య, బియ్యని వెంకటేష్, నారుమల్ల లక్ష్మీనారాయణ, డీటీఎఫ్ నాయకులు చారగొండ శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడి ఉన్న సామగ్రి

16 తులాల బంగారు ఆభరణాల అపహరణ

గద్వాల క్రైం: గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చొరబడి 16 తులాల బంగారు ఆభరణాలను అపహరించిన ఘటన ఆదివారం సాయంత్రం జిల్లాకేంద్రంలో వెలుగు చూసింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని హమలీకాలనీలో ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగి చిన్న రాములు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి మూడురోజుల కిందట హైదరాబాద్‌లోని బంధువుల వద్దకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి రాగా తలుపునకు వేసిన తాళం తెరుచుకొని కనిపించింది. లోనికి వెళ్లి చూడగా సామగ్రి చిందరవందరగా పడి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ మొగిలయ్య, సీఐ శ్రీను, పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని చోరీ ఘటనపై ఆరా తీశారు. సాంకేతిక నిపుణులు, క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బెడ్‌రూంలోని బీరువాలో భద్రపర్చిన 16 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అచ్చంపేటలో వరుస చోరీలు

అచ్చంపేట రూరల్: పట్టపగలే తాళం వేసిన ఇళ్లల్లో చోరీ జరిగిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. పట్టణంలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో నివాసముంటున్న బాల్‌లింగమ్మ వ్యవసాయ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఉదయం ఇంటికి తాళం వేసి ఆఫీస్‌కు వెళ్లింది. రెండు గంటల వ్యవధిలో ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని, ఇంటి ఇరుగు పొరుగువారు ఆమెకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూడగా.. ఇంటి తాళంతో పాటు, బీరువాను పగలగొట్టి అందులోని తులం బంగారు కమ్మలను ఎత్తుకెళ్లారు. అలాగే అదే కాలనీలో పంచాయతీ కార్యదర్శి చంద్రు ఇంటి తాళం పగలగొట్టి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్‌టీంతో ఘటనా స్థలానికి వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాతిపితకు అవమానం

విగ్రహం ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు



కార్యాలయంలోనే కిందపడి ఉన్న గాంధీజీ విగ్రహం

కల్వకుర్తి టౌన్: జాతిపిత మహాత్మా గాంధీకి ఘోర అవమానం జరిగింది. మహాత్ముడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన ఆదివారం పట్టణంలోని చోటు చేసుకుంది. మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని పాత మున్సిపాలిటీ కార్యాలయంలో ఉన్న గాంధీజీ విగ్రహాన్ని శనివారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు కాళ్ల నుంచి ధ్వంసం చేసి పక్కనే పడేశారు. ఆదివారం ఉదయం గుర్తించిన స్థానికులు మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని, నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

పుట్లూరులో మొసలి కలకలం



పుల్లూరులో నది ఒడ్డున మొసలి

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో తుంగభద్ర నది ఒడ్డున గ్రామస్తులకు ఆదివారం మొసలి కనబడడంతో భయభ్రాంతులకు గురయ్యారు. పుల్లూరు నదీ పరివాహక ప్రాంతం కావడంతో ఒడ్డునున్న రాయిపై భారీ మొసలి ఉండడంతో గ్రామస్తులు నది ఒడ్డుకు వెళ్లకుండా సోషల్ మీడియాలో వీడియో, ఫొటోలను పంపించి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రాత్రి సమయంలో నది ఒడ్డుకు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దేవరకద్రలో కార్డెన్‌సెర్చ్


30బైక్‌లు, కారు సీజ్

దేవరకద్ర: మున్సిపాలిటీ కేంద్రంలో శాంతిపరిరక్షణలో భాగంగా ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్ఐ నాగన్నతో పాటు మరో 8మంది ఎస్ఐలు, 80 మంది పోలీసులు దేవరకద్రలోని అన్నివార్డుల్లో కవాతు నిర్వహించి ఇంటింటికి తిరిగి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకుని ఆధార్ కార్డులను పరిశీలించారు. కొత్తవారు, అనుమానితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సరైన పత్రాలు లేని 30 బైక్‌లు, కారును సీజ్ చేశారు. రాత్రి వేళ కొత్తవారు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని యువకులకు సూచించారు.





దేవరకద్రలో తనిఖీలకు బయలుదేరుతున్న పోలీసులు, పట్టుబడిన బైక్‌లు





కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి, ప్రాజెక్టు ఎడమ గట్టున వ్యాపార కేంద్రాల వద్ద రద్దీగా..

సండే సందడి

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్దకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో పెద్దలు, పిల్లలు పెద్ద ఎత్తున కోయిల్‌సాగర్ నీటి పరవళ్లను చూసేందుకు తరలివచ్చారు. నాలుగు రోజులుగా ప్రాజెక్టు గేట్లను తెరిచి నీటి విడుదల కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోకు సమానంగా ఒక గేటును ఎత్తి 750 క్యూసెక్కుల నీటిని వాగులోకి వదిలారు. ఒక గేటు ద్వారా ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి వద్దకు యువత సెల్ఫీలు దిగగా.. కొందరు స్నానాలు చేస్తూ సేద తీరారు. పిల్లలు నీటిలో కేరింతలు కొట్టగా.. మరికొందరు చేపలు పడుతూ సంబరపడ్డారు. ఇక ప్రాజెక్టుకు కుడి, ఎడమ వైపున హోటళ్లు, తిను బండారాల వ్యాపారులు జోరుగా సాగాయి. వ్యాపారులు చేపల ఫ్రై, చేపల పులుసులు చేసి సందర్శకులకు రుచి చూపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది సందర్శకులతో ప్రాజెక్టు సందడిగా మారింది. - దేవరకద్ర



సెల్ఫీ దిగుతూ..



చేపలు పడుతున్న యువకులు

పోలేపల్లి-కిష్టారం మధ్య నిలిచిన రాకపోకలు



పోలేపల్లి-కిష్టారం రోడ్డుపై పారుతున్న వరద

జడ్చర్ల టౌన్: భారీవర్షాల కారణంగా మండలంలోని పోలేపల్లి-కిష్టారం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పోలేపల్లి సమీపంలోని రంగనాయక చెరువు మత్తడి దూకడంతో భారీగా వరదనీరు రోడ్డుపై పారుతోంది. దీంతో జడ్చర్ల-నవాబుపేట మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కారణంగా ఫార్మకంపెనీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిష్టారం, ఖానాపూర్, ఉదండాపూర్ తోపాటు నవాబుపేట మండలంలో నివాసముంటున్న ఫార్మ ఉద్యోగులు విధుల్లోకి చేరేందుకు బయలుదేరగా రోడ్డుపై వరదనీరు పారుతుండడంతో ఆందోళనకు గురయ్యారు. చెరువు అలుగునీరు నుంచి ఇబ్బందులు తొలగించేందుకు రోడ్‌డ్యాం నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాయపల్లి, గుండ్లగడ్డతండాకు..

పోలేపల్లి నుంచి రాయపల్లి, గుండ్లగడ్డతండాకు సైతం రాకపోకలు నిలిచిపోయాయి. పోలేపల్లి నుంచి రాయపల్లికి వెళ్లేమార్గంలో దర్గావద్ద ఫీడర్‌చానల్ మూసివేయడంతో వరదనీరు ఎటూపోలేక గ్రామంచుట్టూ నీళ్లు నిల్చున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి ప్రహరీ నిర్మించడంతో వరదనీరు పోవడంలేదని, ఇదే విషయాన్ని ఆదివారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ప్రహరీ కూల్చివేసి నీళ్లువెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నర్సింగ్‌రావును ఆదేశించారు. మంగళవారం పోచమ్మ బోనాలు, శుక్రవారం దర్గా ఉర్సు ఉండగా రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.